క్లుప్తంగా

క్షయ నిర్మూలనపై కళాజాతా



వీపనగండ్ల: క్షయ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. తూంకుంటలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి బృందసభ్యులు ఆటాపాటల ద్వారా క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, దగ్గు, తెమడ వచ్చిన వెంటనే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి సూచించారు. ప్రాథమిక దశలో క్షయను పూర్తి స్థాయిలో నిర్మూలించవచ్చని ఆయన అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంపై కళాజాతా బృందం సభ్యులు తమ ఆటాపాటల ద్వార ప్రజలకు అవగాహన కల్పించారు.


సమస్యలు పరిష్కరించాలని వినతి

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని 6వ వార్డులో తాగునీటి, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆదిశేషుకు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివసాయి యూత్ సభ్యులు మాట్లాడుతూ 6వ వార్డులో తాగునీరు, డ్రెయినేజీ, మురుగు సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్, రాజు, దశరథం, బీచుపల్లి, గోపాల్, శరధ్‌కుమార్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన కీర్తి శేషులు మాజీ సర్పంచ్ గూడెపు ప్రభావతమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త గూడెపు ఇంద్రసేనారెడ్డి సోమవారం రూ.18 వేల విలువ గల ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సీలింగ్ ఫ్యాన్లు ఉచితంగా అందించడం సంతోషకరంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి దాతల సాయం అభినందనీయం అన్నారు.

ఘనంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



వనపర్తి క్రైం: మండలంలోని పెద్దగూడెం కోదండరామస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం ఎదురుగా సింహాద్వారం ఎదుట ధ్వజస్తంభానికి గ్రామస్తులు పసుపు, కుంకుమతో అభిషేకం నిర్వహించి రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. అనంతరం ధ్వజరోహణం, బలిహరణం, రాత్రికి భేరిపూజ, అగ్ని ప్రతిష్ఠహోమం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆలయం ఎదుట కోలాటాలు, బొడ్డెమ్మ వేస్తూ ఆడిపాడారు.

రక్తదానం



వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీచాణక్య ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న మురళీకృష్ణ కుమార్తె శ్రావ్య సోమవారం రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తన తండ్రి మురళీకృష్ణ రెగ్యులర్‌గా రక్తదానం చేయడం స్ఫూర్తిగా తీసుకొని తాను మొదటిసారి రక్తదానం చేశానని శ్రావ్య చెప్పారు. గతేడాది క్యాన్సర్ డే సందర్భంగా తన జుట్టును సూర్యాపేటలో క్యాన్సర్ రోగుల కోసం ఒక మీటర్ విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు.

ఆలయ భూములకు వేలం నిర్వహించాలి

పెబ్బేరు: తిప్పాయిపల్లి ఆంజనేయస్వామి దేవాలయ భూమి వేలంతో వచ్చిన నగదును ఆలయ అభివృద్ధికి ఉపయోగించాలని హైదరాబాద్ దేవాదాయ కమిషనర్‌కు సోమవారం రాష్ట్ర విద్యావంతుల వేదిక రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసులు కోరారు. ఆయన మాట్లాడుతూ తిప్పాయిపల్లిలో 322, 323 సర్వే నంబర్‌లో 24 ఎకరాల భూమిని కొన్నేళ్లుగా కొంతమంది ఆక్రమణదారులు కబ్జాలో ఉంచుకున్నారు. ఈ భూమిని దేవాదాయ శాఖ అధికారులు ప్రతి ఏడాది గ్రామపంచాయతీ వద్ద బహిరంగ వేలం నిర్వహించి కౌ లు రైతుల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఉపయోగించాలని ఆయన దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే గ్రామంలోని రైతులందరికీ వేలంలో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరారు.

ఆదాయ మార్గాలపై దృష్టి

- మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- వంద శాతం పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: మున్సిపల్ ఆదాయ మార్గాలను పెంపొందించుకునేందుకు పాలక మండలి, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సూచించారు. అమరచింత మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మంగమ్మ ఆధ్వర్యంలో సోమవారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీకి రూ.13 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. వీటితో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు, ఇతర ఆదాయ వనరుల కోసం వెచ్చించాలన్నారు. అదే విధంగా మున్సిపాలిటీకి గ్రాంట్స్ రూపంలో మంజూరైన నిధులను పట్టణంలో అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. ఖర్చుల కోసం రూ.ఐదు లక్షలు మంజూరయ్యాయని, వీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో అనేక సమస్యలు ఉన్నాయని, వీటిని అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు సమన్వయంతో పనిచేసి తమ వార్డులో ఎలాంటి పనులకు ముందస్తు ప్రాధాన్యత ఇవ్వాలో నిర్ణయించి, మొదట వాటిని పూర్తి చేశాలన్నారు. ప్రతి నెల మున్సిపాలిటీకి ఆదాయం సమకూరే కార్యక్రమాలను నిర్వహించి సిబ్బంది వేతనాల కొరత రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వినియోగంతో ప్రయోజనం



పెబ్బేరులో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, వైద్యులు

అమరచింత: పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూర్ పట్టణ కేంద్రంలోని 9వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈమేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, మున్సిపల్ కమిషనర్ రమేష్, కౌన్సిలర్ రామకృష్ణ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు తమ తమ అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ భారతి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని వీరభద్ర డిగ్రీ కళాశాలో సోమవారం విద్యార్థులకు పోషణ్ పక్వాడ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ బాలీశ్వరమ్మ మాట్లాడుతూ తల్లులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం వలన రక్తహీనత రాకుండా ఆరోగ్యంగా ఉంటుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఆరోగ్య పరీక్షలు చేయడం చేశారు. కార్యక్రమంలో ఐసీడీసీ సూపర్‌వైజర్ బాలీశ్వరమ్మ, లక్ష్మీదేవి, ఆసియా, అంగన్‌వాడీ టీచర్లు స్వర్ణలత, స్వరూప, ప్రేమలత, లక్ష్మీనారాయణమ్మ, షాహిన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపద కార్పొరేట్ల వంశం



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

అమరచింత: దేశ సంపదతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దోచి పెడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య బస్సుయాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం యాత్ర అమరచింతకు చేరుకుంది. ఈసందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ అదానీ వ్యవహారంలో హిండెన్ బర్గ్ నివేదికను బహిర్గతం చేయాలని, కార్పొరేట్ల అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లో బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామన్నారు. కుల, మత విద్వేషాలతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం హేయమైన చర్య అని ఎద్దేవా చేశారు. 9 రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను పడగొట్టి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకులకు అవినీతిపై మాట్లాడే అర్హత లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సుయాత్రల ద్వారా బీజేపీ విధానాలను ఎండగడుతూ ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 29న బస్సుయాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ముగింపు సభకు ముఖ్య అతిథిగా సీపీఎం నాయకులు ప్రకాష్‌కరత్ హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, రమ, ధర్మానాయక్, అరుణజ్యోతి, విజయ్, జిల్లా కార్యదర్శి జబ్బార్, సీనియర్ నాయకులు మహమూద్, జీఎస్ గోపి, వెంకటేష్, ఆర్ఎస్ రమేష్, అజయ్, అనంతమ్మ, ఆకాశవేణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న చరణ్‌ప్రసాద్

కొత్తకోట: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటూ హైదరాబాద్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేపట్టిన ఉస్మానియా విద్యార్థి చరణ్‌ప్రసాద్ యాత్ర సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోటకు చేరుకుంది. సైకిల్ యాత్ర చేపడుతున్న చరణ్‌కు స్థానిక హిందూ వాహిని, యువకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకూ దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. మహిళపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలంటూ హైదరాబాద్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేపట్టానన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను రక్షించేందుకు ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చి దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందూవాహిని సభ్యులు శ్రీకాంత్‌యాదవ్, మహేష్, హరికృష్ణ, రాజు, నాగేందర్, రఘు, వివేక్ తదితరులు ఉన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న పోలీసులు



మతిస్థిమితం లేని మహిళతో వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ రామన్‌గౌడ్

వీపనగండ్ల: మండల కేంద్రంలో మూడు రోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళను చేరదీసిన వీపనగండ్ల పోలీసులు ఆమె ఆచూకీ కనుగొని సోమవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించి మానవత్వం చాటుకున్నారు. కర్నూల్‌లోని కల్లూరు ఎస్టేట్‌కు చెందిన హారతి అనే మహిళ మతిస్థిమితం లేకుండా మండల కేంద్రంలో మూడు రోజులుగా తిరుగుతుండగా ఆమెను గుర్తించిన పోలీసులు ఆమెకు అవసరమైన ఆహారాన్ని అందించారు. మహిళ స్వగ్రామాన్ని గుర్తించిన ఎస్ఐ రామన్‌గౌడ్ ఆటో ఏర్పాటు చేసి కర్నూల్‌లోని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనారోగ్యంతో ఉన్న ఈమెను స్థానిక ఆస్పత్రిలో వైద్యం చేయించినట్లు ఎస్ఐ తెలిపారు.

అయ్యప్ప ఆలయ మొదటి ప్రాకారం ప్రారంభోత్సవం



ప్రాకార ప్రారంభోత్సవ వేడుకల్లో పూజలు మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని వీరశాస్త అయ్యప్పస్వామి ఆలయం మొదటి ప్రాకారం ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ న్యాయవాది మున్నూర్ రవీందర్ తన తల్లిదండ్రులు లక్ష్మీదేవి, టైపు కృష్ణయ్య జ్ఞాపకార్థం రాజనగరంలోని అయ్యప్ప ఆలయానికి వెళ్లే దారిలో భగీరథ చౌరస్తా వద్ద దాదాపు రూ.10లక్షలతో నిర్మించిన మొదటి ప్రాకారాన్ని బ్రహ్మవిద్య కుటీర్ ఉత్తరకాశీ పీఠాధిపతులు స్వామి స్థిత ప్రజ్ఞానందా సరస్వతి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఉదయం 7గంటలకు అయ్యప్ప ఆలయం నుంచి ఉత్సవ విగ్రహన్ని ఊరేగింపుగా స్వామి శరణాలు, భజనలు, పాటలు పాడుకుంటూ మొదటి ప్రాకారం వరకు తీసుకొచ్చారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి నవగ్రహ పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మొదటి ప్రాకారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, ఆయన సతీమణి వాసంతి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వేరువేరుగా పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అశ్వద్ధామరెడ్డి, రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, కృష్ణ, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, రామన్‌గౌడ్, నారాయణ, పరశురాం, రామ్మోహన్, రాము, బచ్చురాం తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

గోపాల్‌పేట: ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. సెంటర్‌లో మొత్తం 238 విద్యార్థులకు 234 మంది విద్యార్థులు హాజరవ్వగా.. నలుగురు విద్యార్థులు గైర్హాజయ్యారు. పరీక్షను డీఐఈఓ జాకీర్ హుస్సేన్ పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో రాసేలా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్ బాలప్రసాద్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రాంరెడ్డిలకు సూచించారు.

స్టడీ మెటీరియల్ అందజేత



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో జేఎస్ఆర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 5వ తరగతి గురుకుల పాఠశాలలో ప్రవేశం కోసం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను జేఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి ప్రేమయ్య, బోయేజ్, మిషేక్, భరత్‌భూషణ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో విద్య అభ్యసించి మంచి మార్గంలో నడవాలని సూచించారు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటే రూ.వేలు ఖర్చవుతుందని, ఉచితంగా తరగతులు నిర్వహిస్తున్న వారికి సహకరించేందుకు విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్నామని సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, అమృతరాజ్, రవి, ప్రకాష్, భార్గవి, మోహన్, రాజేష్, ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజ్, రాణి తదితరులు పాల్గొన్నారు.

వంతెన ప్రారంభం



అమరచింత: ఊకచెట్టి వాగుపై వంతెన నిర్మాణంతో ఇరు గ్రామాల ప్రజల రాకపోకలతో పాటు పెబ్బేరు పట్టణానికి వెళ్లే సదుపాయం కలిగిందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేచింతలలో రూ.10 లక్షలతో నిర్మించిన వంతెనను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈమేరకు వంతెనపై ఎమ్మెల్యే ట్రాక్టర్ నడిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వాగులో ప్రవాహాన్ని దాటుకుంటూ పెబ్బేరు పట్టణానికి వెళ్తున్న పరిస్థితులు ఉండేవన్నారు. ప్రస్తుతం వంతెన నిర్మాణం పూర్తి చేయడంతో రేచింతల ప్రజల రవాణా వ్యవస్థ మెరుగైందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, జెడ్పీటీసీ శివరంజని, వైస్ఎంపీపీ కోటేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

‘పుర’ ఎస్ఐగా ఉమామహేశ్వర్‌రెడ్డి



వనపర్తి టౌన్: స్థానిక పుర పాలక సంఘం ఎస్ఐగా (శానిటరీ ఇన్‌స్పెక్టర్)గా ఉమామహేశ్వర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడే సేవలందించిన ఉమామహేశ్వర్‌రెడ్డి రెండేళ్ల క్రితం జిల్లాలోని పెబ్బేర్ మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. వనపర్తి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రమేష్ మూడు నెలలుగా పత్తా లేకుండా పోవడంతో ఇన్నాళ్లు కింది స్థాయి సిబ్బందితోనే శానిటేషన్ విధులు నెట్టుకొచ్చారు. ఈనెల 23న శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం అనే శీర్షికన ‘సాక్షి’ దినపత్రిక కథనం ప్రచురించింది. జిల్లా కేంద్రమైన వనపర్తికి శానిటేషన్ పర్యవేక్షణకు, మెరుగుపరిచేందుకు సంబంధిత అధికారి అవసరమని భావించిన మున్సిపల్ అధికారులు సుదీర్ఘ అనుభవం కలిగిన ఉమామహేశ్వర్‌రెడ్డి పేరును కలెక్టర్‌కు ప్రతిపాదించారు. దీంతో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆమోదం మేర కు ఉమామహేశ్వర్‌రెడ్డి వనపర్తి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. పురపాలికలో డీజిల్ వివాదం, కుక్కలను చంపారనే ఆరోపణలు, కొందరి కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందడం లేదన్న విమర్శల నేపథ్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎమ్మెల్యే పూజలు

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిలలో నూతనంగా నిర్మాణం చేసిన సీతారామాలయంలో స్వామి వారి విగ్రహాలను భక్తుల సమక్షంలో వేదపండితులు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా స్వామి వారికి మూలమంత్ర హోమం, నిర్వహించారు. స్వామి వారికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

వనపర్తి టౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి పేదల సంక్షేమానికి ఎలాంటి పథకాలు అమలు చేయాలి.. దేశాన్ని అభివృద్ధి పథంలో ఎలా నడిపించాలనే ధ్యాసే లేదని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు, మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆదేశాల మేరకు రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వ రద్దును నిరసిస్తూ సోమవారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. స్నేహితులు, అయిన వారికి లాభం చేకూర్చే ఆలోచన తప్పితే ఓట్లేసి గెలిపించిన ప్రజల బాగును పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం మనకు అవసరం లేదని, కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి రానివ్వకుండా చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్‌కు రెండేళ్ల జైలుశిక్ష, పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాదరణ లేని ఏ ప్రభుత్వమైన కూలిపోతుందని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలు, జీరో ఖాతాలకు రూ.15 లక్షలు వేస్తానన్న మోదీ హామీలు ఇచ్చారని.. ఎక్కడున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, మత్స్యకార జిల్లా అధ్యక్షుడు నందిమళ్ల యాదయ్య, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు సమద్‌మియా, నాయకులు కృష్ణబాబు, దివాకర్ యాదవ్, బాబా, వెంకటేష్, మన్యంకొండ, రోహిత్, పెంటయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షకు తరలిన కాంగ్రెస్ నాయకులు

అమరచింత: జిల్లా కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యాగ్రహ దీక్షలో పాల్గొనేందుకు అమరచింత, ఆత్మకూర్ మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో జిల్లా కేంద్రానికి తరలివెళ్లినట్లు అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, తౌఫిక్, ఆత్మకూర్ మాజీ మండల అధ్యక్షుడు రహ్మతుల్లా, పోషిరిగారి విష్ణు, లక్ష్మీకాంత్‌రెడ్డి, హన్మంత్ నాయక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాన్‌గల్: మహిళల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలలో ఆడ పిల్లల వివాహాలకు ఇబ్బందులు కలుగకూడదనే ఉద్దేశ్యంతోనే సీఎం కేసీఆర్ రూ.1,00,116 ఆర్థికసాయం అందిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఆడపడుచు పెళ్లికి ఈ సాయం అందుతుందన్నారు. మండలంలోని 112 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యానాయుడు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ హైమావతి, తహసీల్దార్ ఏసయ్య, డీటీ చక్రపాణి, ఆర్ఐలు తిరుపతయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడానికే చలివేంద్రాలు



ఆత్మకూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, అధికారులు

అమరచింత: తహసీల్దార్ కార్యాలయాలకు నిత్యం రెవెన్యూ పనుల కోసం వస్తున్న ప్రజలకు వేసవిలో దాహార్తిని తీర్చడానికి కార్యాలయ ఆవరణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆత్మకూర్ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో అమరచింత, ఆత్మకూర్ మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో సోమవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు మంగమ్మ, గాయత్రి, తహసీల్దార్లు సింధుజ, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ ఏసయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మండల రైతు బంధు సమితి కోఆర్డినేటర్ వెంకటయ్యానాయుడు, డీటీ చక్రపాణి, ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్, కార్యాలయ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



పాన్‌గల్‌లో విద్యార్థులకు ప్యాడ్లు అందజేస్తున్న దాతలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 85 మంది విద్యార్థులకు ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు మధు, మణికంఠ, కురుమూర్తి కలిసి పరీక్ష ప్యాడ్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మధు, హెచ్ఎం జ్యోతి అన్నారు. సోమవారం మండలంలోని మానాజీపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంజనేయులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన అవసరం



మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మరుగుదొడ్ల నిర్మాణంపై గ్రామ స్థాయి అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కోతులకుంటతండాలో ఎస్‌బీఎం ఫేస్–2 అమలుపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, వీఓలు, సీసీలు, టీఏలు తదితరులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పటం ముగ్గుతో వేయించి గ్రామ వనరులు, ప్రాక్టికల్‌గా మరుగుదొడ్ల నిర్మాణం, లైన్ కలపడం, సెప్టిక్ ట్యాంక్‌ల నిర్మాణం తదితర వాటిని చేయించి చూపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడంతో పాటుగా ప్రతి ఒక్కరూ వాటిని వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఇంకుడు గుంతలు తవ్వుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాటిని ఎలా తవ్వాలనే విషయాన్ని ప్రాక్టికల్‌గా చూపారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, ఏపీఓ సత్యనారాయణ, ఏపీఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జీపీలకు నిధులు మంజూరు చేయాలి



కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రాన్ని చూపుతున్న మండల సర్పంచ్‌ల సంఘం నాయకులు

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో పంచాయతీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి ఇబ్బందులు తొలగించాలని కోరుతూ సోమవారం మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ తేజస్‌నందులాల్ పవార్‌కు వినతిపత్రం అందజేసినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, జీపీల్లో వీధి లైట్ల బిల్లులతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టి పది నెలలు గడిచినా నిధులు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. జీపీల్లో వీధి దీపాలు ఏర్పాటును ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడంతో వీధి దీపాల ఏర్పాటులో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయితీ అధికారికి సూచించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, వెంకటయ్యాయాదవ్, రంగానాయక్, మౌనిక, అనూష, దేవీసింగ్, నాగేష్‌నాయుడు, విష్ణునాయుడు, అనిత, బాలస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.